# నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 25 నవంబర్ 2024 | NIZAMABAD


## కేటీఆర్, కవితతో బీఆర్ఎస్ నాయకుల భేటీ

బోధన్, నవంబర్ 24 : శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆదివారం నాటికి మూడేండ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బీఆర్ఎస్ బోధన్ పట్టణ నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. బోధన్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి విషయమై ఆయనతో చర్చించారు.




బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్సీ కవితతో బోధన్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు

## 29న దీక్షా దివస్

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాల్లో నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జీల నియామకం
- నిజామాబాద్‌కు ఫారూఖ్ హుస్సేన్.. కామారెడ్డికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఫారూఖ్ హుస్సేన్

ఖలీల్‌వాడి, నవంబర్ 24: 2009 నవంబర్ 29న కేసీఆర్ నిరాహార దీక్ష మహోజ్వల ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజు. స్వరాష్ట్ర కల సాకారానికి పునాదివేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో దీక్షా దివస్‌ను నిర్వహించనున్నది. ఇందుకోసం పార్టీ అధిష్టానం అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇన్‌చార్జీలుగా నియమించింది. నిజామాబాద్ జిల్లాకు ఫారూఖ్ హుస్సేన్, కామారెడ్డి జిల్లాకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నియమించింది. మూడు కోట్ల తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో మా తెలంగాణ మాకు కావాలని నినదించారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ తెచ్చుడో అని తెగువను ప్రదర్శించిన నాయకుడికి అండగా నిలబడి దేశ రాజకీయ వ్యవస్థను కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా కదిలించిన ఒక సందర్భం దీక్షా దివస్. పెద్ద ఎత్తున నిర్వహించనున్న దీక్షా దివస్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొననున్నారు.

## బోధన్‌లో ఎక్సైజ్ అధికారి అలర్ట్ మెస్సేజ్ కలకలం!

- సామాజిక మాధ్యమాల్లో రోజంతా వైరల్
- బెల్ట్‌షాపులు, కల్లు వ్యాపారులను ఉద్దేశించిన మెస్సేజ్‌పై సర్వత్రా చర్చ

బోధన్, నవంబర్ 24: బోధన్ డివిజన్‌కు చెందిన ఒక ఎక్సైజ్ అధికారి బెల్ట్ షాపులు, కల్లు డిపోలకు సంబంధించి పోస్టుచేసిన ఓ మెస్సేజ్ వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ కావడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఆదివారం ఉదయం నుంచి సామాజిక మాధ్యమాల్లో ఈ మెస్సేజ్ దర్శనమిచ్చింది. ' హైదరాబాద్ నుంచి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ వస్తున్నది.. అలర్ట్‌గా ఉండండి' అంటూ బెల్ట్ షాప్ నిర్వాహకులు, కల్లు డిపోల యజమానులకు సమాచారం ఇస్తున్నట్లుగా ఆ మెస్సేజ్ ఉండడం గమనార్హం. చేరాల్సినవారికి ఆ మెస్సేజ్ చేరడంతో పాటు రిపోర్టర్లు సభ్యులుగా ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌లోకి వచ్చింది. పొరపాటున ఆ మెస్సేజ్ చాలామంది సభ్యులుగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైరల్ చేశారు. పొరపాటున వచ్చిందేమోగాని.. చట్టం ప్రకారం నడుచుకోవాల్సిన సదరు అధికారి తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. అక్రమ కల్లు వ్యాపారులు, బెల్ట్ షాపుల నిర్వాహకులకు, సదరు ఎక్సైజ్ అధికారికి మధ్య ఉన్న సంబంధాలు దీంతో బహిర్గతమయ్యాయని చర్చించుకున్నారు. తన మెస్సేజ్ వైరల్ అవుతుండడాన్ని గమనించిన సదరు అధికారి తాను పొరపాటున ఒక గ్రూప్‌లో పెట్టిన మెస్సేజ్‌ను డిలీట్ చేయడం కొసమెరుపు. అయితే, అప్పటికే చాలా మంది ఆ మెస్సేజ్‌ను స్క్రీన్ షాట్లు తీయడం, ఇతరత్రా బదిలీ చేయడం ద్వారా డిలీట్ కాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ విషయమై ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరి.

## కాకమ్మో.. చలి

- ఉమ్మడి జిల్లాలో గజగజ
- పడిపోతున్న కనిష్ఠఉష్ణోగ్రతలు
- ఇందూరు @ 15.4 డిగ్రీలు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

ఖలీల్‌వాడి, నవంబర్ 24 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. కొన్నిరోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతున్నాయి. ఆదివారం నిజామాబాద్ జిల్లాలో 31.1 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా..కనిష్ఠ ఉష్ణోగ్రత 15.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇండ్ల నుంచి బయటికి వెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత పెరుగుతుండడంతో గజగజ వణికిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటున్నది. సాయంత్రం 5 దాటిందంటే చలి తీవ్రం అవుతున్నది. కొన్నిచోట్ల చలి కారణంగా ఉదయం, సాయంత్రం పొగమంచు అలుముకోవడంతో పాటు చల్లని ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా ప్రజలు వణుకుతున్నారు. ఉదయం భానుడు వచ్చే వరకు చలి ఉంటున్నది. ఇప్పుడే చలి ఇంతగా ఉంటే మరో రెండు నెలల పాటు మరెంత తీవ్రంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

### పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థుల ఇబ్బందులు..

నిజామాబాద్ జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం 7.30 గంటలకే తరగతులు ప్రారంభిస్తున్నారు. అంతేకాకుండా స్కూల్ బస్సులు ఉదయం 6 నుంచే మొదలు కావడం, చలి ఎక్కువగా ఉంటుండడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



### వారం రోజులుగా నిజామాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

| తేది | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నవంబర్ 18 | 33.2 | 15.9 |
| నవంబర్ 19 | 32.1 | 15.8 |
| నవంబర్ 20 | 32.3 | 15.6 |
| నవంబర్ 21 | 31.1 | 15.8 |
| నవంబర్ 22 | 31.5 | 15.8 |
| నవంబర్ 23 | 30.5 | 15.6 |
| నవంబర్ 24 | 31.1 | 15.4 |

### వేడి ఆహారాన్ని తీసుకోవాలి

చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండడంతో కుటుంబీకులు ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఆహారం వేడిగా ఉన్న సమయంలోనే తీసుకోవడం ఉత్తమం. ఆస్తమా ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. వ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ స్వెటర్, మంకీ క్యాపు వాడాలి.

-జలగం తిరుపతి రావు,
ఎండీ, ఫిజీషియన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్







### జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

- రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిని తాగాలి, చలిలో తిరగాల్సి వస్తే చెవులు, ముక్కు కప్పి ఉండేలా ఉన్ని దుస్తులు, మంకీ క్యాప్ ధరించాలి.
- వేడిగా ఉండే ఆహార పదార్థాలనే తీసుకోవాలి. శీతల పానీయాలు, ఐస్‌క్రీంలు, ఇతర చల్లటి పానీయాలకు దూరంగా ఉండడం మేలు. స్వీట్లు ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిది.
- చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. తల్లిపొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి. ప్రయాణం చేయాల్సి వస్తే శరీరాన్ని పూర్తిగా కప్పేసి ఉండేలా చూసుకోవాలి.
- అస్తమా, నిమోనియా, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉంటూ మెడిసిన్ వాడాలి. అత్యవసర సమయాల్లో బయటికి వెళ్లాల్సి వస్తే మాస్కులు, స్వెటర్లు ధరించాలి.

## మనలోని లోపాలను సరిదిద్దుకోవాలి

ప్రముఖ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు



ప్రవచనాలు చేస్తున్న గరికపాటి

బాన్సువాడ టౌన్, నవంబర్ 24: సమాజంలోని లోపాలను ఎత్తి చూపే ముందు మనలోని లోపాలను మనమే గుర్తించి స్వతాహాగా మార్పు తెచ్చుకొని మంచి మార్గంలో నడవాలని ప్రముఖ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు అన్నారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో అయ్యప్ప సేవా సమితి, అయ్యప్ప నిత్యఅన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్తీక మాసం, సనాతన ధర్మం అంశాలపై మాట్లాడారు. దీక్షలో ఉన్నప్పుడు ఎలాంటి నియమాలతో ఉంటామో, దీక్ష లేనప్పుడు కూడా అలాగే నియమనిష్టలతో ఉండాలని సూచించారు. శివ పార్వతుల సంతాన ఫలమే కార్తీక మాసమని, అందుకే కార్తీక మాసంలో శివుడిని ప్రత్యేకంగా పూజిస్తారని, అయ్యప్ప మాల ధరిస్తారని తెలిపారు. మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయ ధర్మకర్త పరిగె శంభురెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

- కాలభైరవస్వామి జన్మదిన వేడుకలు సంపూర్ణం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

రామారెడ్డి, నవంబర్ 24: మండలంలోని ఇస్సన్నపల్లి- రామారెడ్డి గ్రామాల్లో వెలసిన శ్రీ కాలభైరవస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐదురోజులపాటు ఉత్సవాలు కొనసాగగా.. ఆదివారం ఉదయం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి రథయాత్రను ప్రారంభించగా.. రెండు గ్రామాల ప్రజలు, మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. రథోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ కౌలాస్ మహంత్ స్వామి వారి ఆధ్వర్యంలో అగ్నిగుండాలు నిర్వహించారు. భక్తులు ఓం ఓం భైరవ అంటూ అగ్నిగుండాలను దాటారు. గ్రామంలో చక్కెర తీర్థం రెండు రోజులపాటు కొనసాగనున్నది. సీఐ రామన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బందోబస్తును కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బూర్ల ప్రభురాంచంద్రం, ఆలయ పూజారులు శ్రీనివాస్‌శర్మ, వీరశైవులు జంగం ప్రభాకర్‌స్వామి, వంశీ శర్మ, ఆలయ సిబ్బంది నాగరాజు, యాదగిరి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

## అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల ఎత్తివేత



మూసి ఉన్న మహారాష్ట్ర సరిహద్దులోని బెల్లూర్ చెక్‌పోస్టు

రెంజల్, నవంబర్ 24 : మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడైన నేపథ్యంలో తెలంగాణ -మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఎత్తివేశారు. రెంజల్ మండలం కందకుర్తి, సాలూరా మండల సరిహద్దు, బోధన్ మండలం ఖండ్‌గాం, పొతంగల్, అంతరాష్ట్ర శివారు గ్రామాల సరిహద్దు, మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా బెల్లూర్ గ్రామం వద్ద గత నెల 17న ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## 9 మంది సీఐలకు స్థానచలనం

- ఉత్తర్వులు జారీ చేసి ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

వినాయక్‌నగర్, నవంబర్ 24: మల్టీజోన్ -1 పరిధిలో సీఐలకు స్థాన చలనం కలిగింది. తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ ఎన్.వీరయ్యను నిజామాబాద్ పీసీఆర్ (పోలీస్ కంట్రోల్ రూమ్)కు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా డీసీఆర్‌బీ (డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో)లో విధులు నిర్వర్తిస్తున్న పబ్బ ప్రసాద్ రానున్నారు. హైదరాబాద్ ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎస్.సతీశ్ కుమార్‌కు నిజామాబాద్ సీసీఆర్‌బీ (కమిషనరేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో)లో పోస్టింగ్ ఇచ్చారు. వీరితో పాటు జగిత్యాల్, మానకొండూర్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన మొత్తం తొమ్మిది మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## 'ట్రెజరీ'లో చలనం!

- పక్కకు నెట్టివేసిన ఫైళ్లకు మోక్షం
- కొత్త టీచర్లకు ఐడీ, ప్రాన్ నంబర్లు రిలీజ్
- 'నమస్తే తెలంగాణ' కథనంతో కదలిక
- మిగతా దోపిడీపై విచారణ చేస్తేనే బహిర్గతం

నిజామాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి జిల్లా ట్రెజరీ శాఖలో ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. ఉద్యోగుల్లో ఎట్టకేలకు చలనం వచ్చింది. డబ్బులు లేకుండానే ఎంప్లాయ్ ఐడీ, ప్రాన్ నంబర్లను రిలీజ్ చేస్తున్నారు. టేబుళ్లపై చేరిన కొత్త టీచర్లకు సంబంధించిన ఎంప్లాయ్ ఐడీ, ప్రాన్ నంబర్ల రిలీజ్ తంతులో వేగం పెరిగింది. పైసల కోసం ఆశ పడి రోజుల తరబడి పక్కకు నెట్టివేసిన ఫైళ్లకు క్లియరెన్సు లభిస్తున్నది. కోశాధికారి కార్యాలయంలో గుట్టుగా చోటుచేసుకుంటున్న అక్రమాలను 'నమస్తే తెలంగాణ' కథనం రట్టు చేసింది. ఫైళ్లకు పైసలను ముడి పెట్టి నూతనంగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారందరినీ వేధిస్తున్న తీరును ఎండగట్టింది. ఈ నెల 21న 'ట్రెజరీలో దొంగలు' శీర్షికన ప్రచురితమైన కథనంతో అక్రమార్కులు ఉలిక్కిపాటుకు గురయ్యారు. వందలాది మంది కొత్త టీచర్ల నుంచి భారీగా డబ్బులు దండుకునేందుకు వేసిన స్కెచ్ విఫలం కావడంతో ఒక్కసారిగా తప్పును సరిదిద్దుకునే పనిలో పడ్డారు. ఈ విషయంపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సైతం దృష్టి సారించడంతో అక్రమార్కులు డబ్బుల మాటెత్తకుండా ప్రాన్ నంబర్లు, ఎంప్లాయ్ ఐడీని జారీ చేసేందుకు మొగ్గు చూపారు.

### కుటుంబీకుల పేర్లమీద చెల్లింపులు

ట్రెజరీలో అక్రమాల్లో డిజిటల్ పేమెంట్స్ ఆసక్తికి గురి చేస్తోంది. కొంతమంది నగదు రూపంలో తీసుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నారు. కొంత మంది ఉపాధ్యాయులకు ట్రెజరీలోని మహిళా ఉద్యోగినులు సైతం వేధింపులకు గురి చేసిన ఘటనలూ వెలుగు చూస్తున్నాయి. వీరిలో కొంతమది ఏకంగా ఒక అడుగు ముందుకేసి ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు సైతం ఇచ్చారు. ఈ డిజిటల్ పేమెంట్‌లో కుటుంబీకుల ఫోన్ నంబర్లు ఇచ్చి పేమెంట్స్ చేయించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భర్తలు, భార్యలు, కుమారుల నంబర్లకు ఫోన్‌పే, గూగుల్ పే చేసినట్లు తెలిసింది. డిజిటల్ పేమెంట్స్ చెల్లింపుల్లో వచ్చే బ్యాంకు అకౌంట్‌లో ఖాతాదారుడి పేరుతో ఈ విషయం బహిర్గతమైంది. కొత్త టీచర్లకు ఎదురైన సమస్యపై టీపీటీఎఫ్ ఉద్యోగ సంఘం వినతి పత్రంతోపాటు 'నమస్తే తెలంగాణ' సంధించిన వార్తా కథనంతో ఒక్కసారిగా సంబంధీకుల్లో భయం పట్టుకున్నది. విద్యాశాఖకు సంబంధించిన వేధింపులే కాకుండా ట్రెజరీతో చెల్లింపుల వ్యవహారం ముడిపడి ఉన్న ప్రతి శాఖలోనూ వందలాది మంది బాధితులున్నారు. వేధింపులపై నిఘా పెడితే అక్రమార్కుల వ్యవహారాలు కోకొల్లలుగా బయటపడే అవకాశం ఉన్నదని బాధితులు చెబుతున్నారు. ట్రెజరీ దోపిడీపై ఉన్నత స్థాయిలో విచారణ చేయించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కలెక్టరేట్‌లో పని చేసే ఉద్యోగులతోపాటు పోలీస్ శాఖకు చెందిన వారు కూడా కోరుతున్నారు. అవినీతి, నిర్లక్ష్యాన్ని సహించని కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

### ఉద్యోగ సంఘాలు పట్టించుకోవా..?

ఉద్యోగులకు కష్టాలు వస్తే ఏమరపాటులో ఉద్యోగ సంఘాలు స్పందించాలి. వారికి మేమున్నామంటూ ముందుకు వచ్చి నిలబడాలి. ట్రెజరీ అక్రమాల వ్యవహారాల్లో ఉద్యోగ సంఘాల పాత్రపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఉద్యోగులను పీక్కుతింటున్న వ్యవహారం అందరికీ తెలిసినప్పటికీ నాయకులు మిన్నకుండిపోవడంపై సిబ్బంది మండిపడుతున్నారు. టీఎన్‌జీవో, టీజీవో, ఉపాధ్యాయ సంఘాలకు చెందిన బాధ్యులంతా ఈ విషయంపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగ సంఘాల సమావేశాల్లో గొప్పలు మాట్లాడే నాయకులు ఈ విషయంపై మౌనం వహించడం ట్రెజరీ ఉద్యోగులకు సపోర్ట్ చేస్తున్నట్టే కదా? అని కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి ట్రెజరీకి ఏడీగా కొత్తగా వచ్చిన అధికారి ఈ విషయంపై లోతుగా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ట్రెజరీ ఉన్నతాధికారికి మంచి పేరున్నప్పటికీ కింది స్థాయిలో సంఘాల పేరుతో ఒకరు, విచ్చలవిడితనంతో మరికొందరు ఇలా దోపిడీకి పాల్పడుతుండడంతో శాఖకు చెడ్డ పేరు వస్తున్నదని ప్రభుత్వ ఉద్యోగులు చెబుతున్నారు.